క్లుప్తంగా

ఉత్కంఠభరితంగా 'ఆడుదాం ఆంధ్ర క్రికెట్'



నకరికల్లు: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఆడుదాం ఆంధ్ర - ఇది అందరి ఆట' పేరుతో క్రీడాపోటీలు మంగళవారం ఉత్కంఠభరితంగా సాగాయి. పలు సచివాలయాల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉత్కంఠభరితంగా క్రీడాపోటీలు జరుగుతున్నాయన్నారు. గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో ప్రతిభ చాటితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న పోటీలకు గ్రామాల ప్రజల నుంచి పూర్తి సహకారం లభిస్తుందని అన్నారు. త్వరలో మండలస్థాయి పోటీలు ప్రారంభమవుతాయని అన్నారు. పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం, వీవీప్యాట్‌ల పై ఓటర్లకు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. తహసీల్దార్ ఎం.భవానీశంకర్ పాల్గొని ఓటర్లకు ఈవీఎంలపై ఉన్న అపోహలను తొలగించారు. ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత వీవీ ప్యాట్ ద్వారా స్లిప్ వస్తుందని, ఏమైనా సందేహాలుంటే పరిశీలించుకోవచ్చన్నారు. ఏ గుర్తుకు ఓటరు ఓటు వేశారో స్లిప్‌లో కనిపిస్తుందన్నారు. ఓటర్ల సందేహాలను స్వయంగా పరిశీలించి, వారిచే ఓటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, వీఆర్వో అశోక్, మాబువలి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: రానున్న ఎన్నికలను పురస్కరించుకొని పట్టణంలోని 32, 33, 34 పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. బీఎల్‌ఏలకు ఈవీఎంల పని తీరుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు. సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

6న పెంచిన పింఛన్ల పంపిణీ

నకరికల్లు: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని ఈనెల 6వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా పింఛన్‌ను రూ.3వేలకు పెంచిన విషయం విదితమే. పెంచిన పెన్షన్‌లను రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. అన్నిగ్రామాల కార్యదర్శులు, వలంటీర్లు సిద్ధంగా ఉండాలని సూచించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

అమరావతి: రాష్ట్రంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి నండూరి పీటర్ పాల్ అన్నారు. అమరావతిలో మంగళవారం అమరావతి మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీటర్ పాల్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఫెలోషిప్ ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ మండల ప్రజలకు సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులుగా హాజరైన రెవరెండ్ సత్యానంద్ కుమార్ మాట్లాడు తూ అన్నివర్గాల ప్రజలు 2024లో సుఖసంతోషాలతో ఉండాలన్నారు. పాస్టర్లు రావెల అశోక్, ప్రభుదాస్, ప్రకాశరావు, కోటా నెహెమియా, పాల్ బాబు, విజయకుమార్, డేవిడ్, ఎలీషా, దీపక్ బాబురావుపాల్గొన్నారు.

క్రోసూరు మండలంలో 114 నూతన పెన్షన్లు

క్రోసూరు: మండలంలోని ప్రతి నెల ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పెన్షన్ కానుక నూతన సంవత్సరంలో జనవరి నెలకు 114 మందికి కొత్తగా మంజూరయ్యాయని ఎంపీడీఓ బి.మహేష్ మంగళవారం తెలిపారు. వీరందిరికీ ప్రతి నెలా రూ.3వేలు అందించనున్నట్లు తెలిపారు. గత డిసెంబర్ వరకు మండలంలో మొత్తం పింఛన్‌దారులు 8829 ఉండగా జనవరి నెలలో 8943 (114 మంది అదనంగా) లబ్ధిపొందుతున్నట్లు తెలిపారు. వీరందరికీ పెన్షన్ పంపిణీ చేసేందుకు రూ.2,66,80,000 (రెండు కోట్ల, అరవై ఆరు లక్షల, ఎనభైవేల రూపాయలు) మంజూరైనట్లు ఎంపీడీఓ వివరించారు. బుధవారం నుంచి పంపిణీ ప్రారంభించనున్నట్లు చెప్పారు.

నేడు పెన్షన్ల పంపిణీ

క్రోసూరు: క్రోసూరులోని సచివాలయం-2 పరిధిలోని కొండ కింద బజారులోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పంచాయతీ ఈఓపీఆర్డీ పి.శివరామయ్య మంగళవారం తెలిపారు. రూ.3వేలకు పెంచిన పెన్షన్లను ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఈకార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- పాటిబండ్లలో రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం



మహిళకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య బాధ్యతను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకుని పని చేస్తోందని, ఆరోగ్యాంధ్రప్రదేశే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాటిబండ్ల గ్రామంలో రెండో దశ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష హెల్త్ క్యాంప్‌లో జరుగుతున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి వెళ్లి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యలను గుర్తించడం జరుగుతుందన్నారు. వారికి హెల్త్ క్యాంపుల్లో ఉచిత వైద్య పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం చేస్తున్న మంచిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రజల ప్రాణాలు గాలికొదిలేశారన్నారు. నియోజకవర్గంలో రూ.25 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరణ చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, పార్టీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్, కో-ఆప్షన్ సభ్యులు షేక్ బాషా, నియోజకవర్గ మహిళ నాయకురాలు ఐన్నమ్మ, సచివాలయ కన్వీనరు మాగులూరి అనిల్‌కుమార్, కిషోర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మరియరాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ...

మండలంలోని పాటిబండ్లలో విద్యార్థులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ట్యాబ్‌లను అందించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

5 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సత్తెనపల్లి ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ కోరారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి మండలంలో ఈ నెల 5వ తేదీ నుంచి రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. ప్రజలకు ఆరోగ్య భద్రత, మెరుగైన వైద్య సదుపాయాలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. సచివాలయాల వారీగా వైద్యశిబిరాలు నిర్వహించే తేదీలపై ముందుగానే ప్రజలకు తెలియజేయాలన్నారు.

- మండలంలో ఈనెల 5న పెదమక్కెన, 9న కంటేపూడి, 19న గుడిపూడి, 23న కొమెరపూడి, ఫిబ్రవరి 2న గుజ్జర్లపూడి (భట్లూరు), ఫిబ్రవరి 9న నందిగామ-2, 16న ఫణిదం-2, 23న నందిగామ-1, మార్చి 1న అబ్బూరు, మార్చి 12న కంకణాలపల్లి, 19న కట్టమూరు, 26న ధూళిపాళ్ల, ఏప్రిల్ 2న రెంటపాళ్ల, ఏప్రిల్ 12న బృగుబండ, 16న భీమవరం, 26న కందులవారిపాలెం, మే7న పాకాలపాడు, మే 14న లక్కరాజుగార్లపాడు 14 గ్రామాల్లో వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ శిబిరాల్లో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల వైద్యులు వైద్య సేవలు అందిస్తారన్నారు.

గణపవరంలో...

రాజుపాలెం: గ్రామంలోని ప్రతీ కుటుంబం, కుటుంబంలోని ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోవాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని గణపవరం-1 గ్రామ సచివాలయం పరిధిలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం మంగళవారం జరిగింది. ఈ శిబిరాన్ని ఎంపీపీ, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్‌లు ప్రారంభించారు. ఈ శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సుమిత్ర, డాక్టర్ సాయికృష్ణలు పాల్గొన్నారు. 252 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. షుగర్, బీపీ ఉన్న వారికి 15 రోజులకు సరిపడా మందులను అందించారు. సర్పంచ్ బొలమాల నాగమల్లేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజ నాయక్, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ ముక్కంటి, హెల్త్ సూపర్‌వైజర్‌లు జీవన్‌రావు, ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి మహంకాళమ్మ పాల్గొన్నారు.



గణపవరంలో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం..

బెల్లంకొండ: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, దేశంలో ఎక్కడా లేని వైద్య సేవలను 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం ద్వారా ప్రజల ఇళ్ల వద్దకు తీసుకువచ్చారని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష-2' వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆరోగ్య సురక్ష పథకం పేదలకు ఒక వరం లాంటిదని తెలిపారు. ప్రతీ పేదవాడికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎంతో మంది వారికి ఉన్న అనారోగ్యాలపై అవగాహన లేకపోవడం లేదా అశ్రద్ధ చేయడం వల్ల ప్రాణాల మీదకు తెచ్చుకుంటారన్నారు. దీని వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం కాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. ఈ వైద్య శిబిరంలో 306 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. ఎంపీడీఓ వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ దారం రమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, పార్టీ నాయకులు చిట్టిబాబు, బొడ్డుపల్లి రాము, రామిరెడ్డి, బోనం వెంకట్రామిరెడ్డి, వివిధ గ్రామాల ఏఎన్‌ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.



మన్నెసుల్తాన్‌పాలెంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

5 నుంచి ఆరోగ్య సురక్ష శిబిరాలు..

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామసచివాలయాల్లో ఈ నెల 5 వతేదీ నుంచి రెండవ విడత ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ జరుగుతుందని ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి మంగళవారం తెలిపారు. 5న మాదల-2 గ్రామ సచివాలయం పరిధిలోను, 12న తొండపి, 19న పలుదేవర్లపాడు, 23న ఇరుకుపాలెం, 30న గోళ్లపాడు, ఫిబ్రవరి 6న లంకెలకూరపాడు, 13న మాదల-1, 23న దమ్మాలపాడు, 27న రుద్రవరం, మార్చి 15న చాగంటివారిపాలెం, మార్చి 22న బొల్లవరం, 26న నార్నెపాడు గ్రామ సచివాలయం పరిధిలోను ఆరోగ్యసురక్ష వైద్య శిబిరాలు నిర్వహించటం జరుగుతుందన్నారు.

ఏపీ ఎన్జీఓస్ క్యాలెండర్ ఆవిష్కరణ



అచ్చంపేట: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నాన్‌గెజిటెడ్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను తహసీల్దార్ సీహెచ్ పద్మాదేవి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసేవలో ఎన్జీఓల పాత్ర ఎనలేనిదని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఎన్జీఓలంతా ఉద్యోగోన్నతులు సాధించి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఆకాంక్షించారు. స్థానిక పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంకట్రావు, పశువైద్య సహాయకులు కంబాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గంగసానిబాబు, మాజీ సర్పంచ్ సుంకర శ్రీనివాసరెడ్డి, సచివాలయ కార్యదర్శి భరత్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్..

అచ్చంపేట: ఎస్టీయూ(స్టేట్ టీచర్స్ యూనియన్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఎంఈఓ-1 మేడా శ్రీనివాసరావు, ఎంఈఓ-2 నరసింహారావులు స్థానిక విద్యావనరుల కార్యాలయం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా విధినిర్వహణలో బాధ్యతగా మెలగాలని, విద్యా ప్రమాణాలను పెంపొందించే విధంగా పనిచేయాలని సూచించారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ జి.దేవరాజ్, మండలశాఖ అధ్యక్షుడు జి.గంగయ్య, ప్రధాన కార్యదర్శి వి.వీరవాసు, సభ్యులు గంగాధర్, మహబూబ్ సుభాని, శ్రీనివాసరావు, సురేష్ బాబు, మల్లేశ్వరరావు, సత్యదేవ్, దుర్గ, కృష్ణారెడ్డి, షేక్ ఇంతాజ్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ..

పెదకూరపాడు: మండల యూటీఎఫ్ క్యాలెండర్, డైరీను మంగళవారం మండల విద్యావనరుల భవనంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య ఆవిష్కరించారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు బెల్లంకొండ శివ శంకర్, ఎంఈఓ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్,, గౌర వాధ్యక్షులు చిర్రా శ్రీనివాసరెడ్డి, రాధాకృష్ణ, శీలంనేని సాంబశివరావు, కాత్యాయని పాల్గొన్నారు.

మార్గం.. సుగమం

- నెరవేరిన దశాబ్దాల కల
- రూ.60 లక్షల ఏఎంసీ నిధులతో పాటిబండ్ల – పెదకూరపాడు బీటీ రోడ్డు నిర్మాణం
- మూడు గ్రామాల ప్రజలకు తీరిన ఇబ్బందులు
- ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- ప్రయాణికులు, గ్రామస్తుల హర్షం



పాటిబండ్ల - పెదకూరపాడు నూతన బీటీ రహదారి

పెదకూరపాడు: మాట ఇచ్చారంటే దానిని నిలబెట్టుకోవడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే చెల్లింది. గత రెండు దశాబ్దాలుగా రైతులు, మూడు గ్రామాల ప్రజలు పడుతున్న ఇక్కట్లకు తెరదించింది. మండల కేంద్రానికి రావాలంటే అష్టకష్టాలు పడే గ్రామీణులకు పాటిబండ్ల రహదారి నిర్మాణంతో కష్టాలు తీరాయి.

పట్టించుకోని గత టీడీపీ ప్రభుత్వం..

పెదకూరపాడు - పాటిబండ్ల రోడ్డు నిత్యం రద్దీ గా ఉండేది. గత రెండు దశాబ్దాల క్రితం నుంచి రహదారి పూర్తిగా అధ్వానంగా మారి రాకపోకల కు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి. ఈ రహదారిని గత టీడీపీ పాలకులు పట్టించుకోలేదు. వ్యవ సాయ పనులకు వెళ్లే రైతులు, పాటిబండ్ల, జలాల్‌పురం, బుస్సాపురం గ్రామాలవారు మండల కేంద్రమైన పెదకూరపాడుకు వచ్చే గ్రామస్తులు అధ్వాన రహదారితో తీవ్ర ఇక్కట్ల పాలయ్యేవారు. పలు ప్రమాదాలకు సైతం గురయ్యేవారు.

రూ.60లక్షలతో నిర్మాణం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఏఎంసీ నిధులు రూ.60 లక్షలతో ఈ రహదారిని 2.7 కిలోమీటర్ల మేరకు నిర్మించారు. ఈ రహదారిపై మంచి తారు రోడ్డు నిర్మించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధికి నోచుకోని రహదారులను అభివృద్ధి చేసి చూపించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మిక గ్రామానికి అందమైన రహదారి...

రోమన్ కేథలిక్ సంఘం ఆధ్యాత్మిక గ్రామమైన పాటిబండ్లకు అందమైన రోడ్డు సమకూరింది. పాటిబండ్ల నుంచి అనేక మంది కేథలిక్ ఫాధర్లుగా, మఠకన్యలుగా వివిధ దేశాల్లో, రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్నారు. ప్రతి ఏడాది జనవరి 5,6 తేదీల్లో పాటిబండ్ల గ్రామంలో ముగ్గురు రాజుల తిరునాళ్ల వైభవంగా జరుగుతుంది. ఈ తిరునాళ్లకు వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వేలాదిగా గ్రామానికి తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. తిరునాళ్ల సమయానికి రోడ్డు పూర్తి కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన మాట నెరవేర్చిన ఎమ్మెల్యే..



ఇచ్చిన మాట మేరకు పాటిబండ్ల - పెదకూరపాడు రోడ్డును ఎమ్మెల్యే నిర్మించారు. ఈ రహదారి గతంలో అధ్వానంగా ఉండడంతో గ్రామస్తులు, ఇతర గ్రామాల వారు సైతం అనేక ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృషితో మంచి రోడ్డు నిర్మాణం జరిగింది. –బెల్లంకొండ మీరయ్య, ఎంపీపీ, పెదకూరపాడు

మా కష్టాలు తీరాయి..



ఏళ్ల తరబడి రోడ్డు అధ్వానంగా ఉంది. నూతన రోడ్డు నిర్మాణంతో పొలాలకు, ఊళ్లకు వేళ్లేందుకు ఇబ్బందులు తీరాయి. ఈ రోడ్డు మళ్లీ నిర్మిస్తారని ఊహించలేదు. మూడు గ్రామాల ప్రజలకు మేలు జరిగింది. ఎంతో సంతోషంగా ఉంది. –పాటిబండ్ల రోజమ్మ, పాటిబండ్ల

ఆడపిల్లలు పుట్టడం అదృష్టంగా భావించాలి

ఏరియా వైద్యశాలలో బంగారు తల్లి పథకం ప్రారంభం



బంగారు తల్లి పథకం ప్రారంభోత్సవంలో ఆడపిల్లలు, తల్లులతో కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: ఆడపిల్లలు పుట్టడం తల్లిదండ్రులు అదృష్టంగా భావించాలని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల ప్రకారం పట్టణంలోని ఏరియా వైద్యశాలలో బంగారు తల్లి పథకాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ఆడపిల్లలు ఏమాత్రం తక్కువ కాదన్నారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ ఎన్నో వినూత్న సేవ కార్యక్రమాలు చేపట్టారని, అందులోనూ ముఖ్యమైంది బంగారు తల్లి పథకం అన్నారు. ప్రతి మంగళవారం బంగారు తల్లి పథకాన్ని నిర్వ హిస్తామని, వారంలో పుట్టిన ఆడపిల్లలందరూ తల్లిదండ్రులతో ఫోటో తీసి ఆ ఫ్రేమ్‌ని తల్లిదండ్రులకి అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి అంబటి రాంబాబు సహకారంతో వైద్యశాల అవార్డులను అందుకుంటూ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి మంగళవారం బంగారు తల్లి పథకాన్ని నిర్వ హిస్తామని, పుట్టిన ఆడపిల్ల తల్లిదండ్రులతో కేక్ కటింగ్ సెలబ్రేషన్ అదే విధంగా ఫోటో ఫ్రేమ్ అందజేయడం జరుగుతుందన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత మాట్లాడుతూ నెలలో సుమారు 150 నుంచి 170 ప్రసవాలు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో జరుగుతాయన్నారు. వారిలో 60 శాతం ఆడపిల్లలు పుడుతున్నారన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సుష్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, ఫార్మసీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఓ గంగా భవాని, కౌన్సిలర్ సునీత, ఆడపిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మిర్చి పంట పరిశీలన

క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామానికి రైతు కొలారు కృష్ణారావు ఫిర్యాదు మేరకు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ సీవీ రమణ మంగళవారం పిందెలు, కాయలు రాని మిరప పంటను పరిశీలించినట్లు ఏడీఏ హనుమంతరావు తెలిపారు. రైతుసాగు చేసిన మిరప పంట ఎదుగుదల లేక, కాయలు, పిందెలు లేక బొబ్బరతెగుళ్ల ఆశించినట్లు పరిశీలనలో తేలిందన్నారు. దీనిపై శాస్త్రవేత్త మొక్కల శ్యాంపిల్‌ను సేకరించి తీసుకెళ్లినట్లు ఏడీఏ వివరించారు. ఏఓ వేణుగోపాల్, జీనెస్స్ కంపె నీ ప్రతినిధులు, రైతుభరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బాజీ చౌదరిపై చర్యలు తీసుకోవాలి

నకరికల్లు: దళిత యువకులను అతి దారుణంగా కొట్టి గాయపరిచిన తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బాజీచౌదరిపై కఠినచర్యలు తీసుకోవాలని మాలమహానాడు సోషల్‌మీడియా ఇన్‌చార్జి గోదా బాల మంగళవారం డిమాండ్ చేశారు. క్రోసూరు మండలానికి చెందిన నలుగురు ఎస్సీ యువకులపై కుంకలగుంట గ్రా మంలో గత ఆదివారం దాడిచేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అధికార, కుల అహంకారంతో దళితులపై దాడికి పాల్పడిన బాజీచౌదరిపై కేసునమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేకుంటే తమ సంఘం బాధితుల తరపున పోరాడుతుందని అన్నారు.

వైభవంగా సీతారావమ్మ మాతాజీ ఆరాధన

బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెంలోని కొండ శింగరేశ్వర స్వామి ఆశ్రమంలో మాతాజీ శీతారావమ్మ 8వ ఆరాధన కార్యక్రమాన్ని మంగళవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. 2017 జనవరి 2వ తేదీన అకాల మరణం పాలైన శీతారావమ్మ మాతాజీని స్మరించుకుంటూ ఆరాధన కార్యక్రమాన్ని జరుపుకుంటున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. వేకువ జామున గ్రామస్తులు మాతాజీ ఆశీనురాలైన పవిత్ర స్థలంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యకమంలో గ్రామస్తులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపుగా 2 వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 7 నుంచి గ్రామంలో జెండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించండి



పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య

క్రోసూరు: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య మంగళవారం తెలిపారు. వివరాల కోసం గ్రామ సచివాలయం(రైతుభరోసా కేంద్రం), లేదా పశువైద్యాధికారి, లేదా టెలి మెడిసన్ కాల్‌సెంటర్ 1962ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా గాలికుంటువ్యాధి లక్షణాల గురించి డాక్టర్ మల్లయ్య తెలుపుతూ తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు రొప్పటం, చూడి పశువులు ఈసుకుపోవటం, ఎద్దులలో పనిసామర్థ్యం తగ్గటం వంటి లక్షణాలుంటాయన్నారు. తద్వారా పాల ఉత్పత్తి, పనిసామర్థ్యం గణనీయంగా తగ్గిపోవటం, రైతుకు ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు. పాలు తాగే దూడలలో మరణాలు సంభవిస్తాయన్నారు. వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోతాయన్నారు. కాబట్టి నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. పశువు గుర్తింపు కోసం చెవిపోగు తప్పనిసరి అన్నారు. కావున పాడి రైతులు, పశుపోషకులు, జీవాల యజమానులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని డాక్టర్ మల్లయ్య కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యడ్లపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. యడ్లపాడు దిగువ ఎస్సీ కాలనీకు చెందిన శామ్యూల్(50) పిల్లికొండ సమీపంలో జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో గుంటూరు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి, ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రగాయాలతో శామ్యూల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతనిపై నుంచి రెండు వాహనాలు దూసుకెళ్లడంతో.. ముఖం గుర్తించలేని విధంగా ఛిద్రమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

బెల్లంకొండ: మండంలోని పలు గ్రామాలలో బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పర్యటించనున్నట్లు ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మావెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు మండలంలోని వన్నాయపాలెంలో రూ.3వేలకు పెంచిన వైఎస్సార్ ఆసరా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అదేవిధంగా 10 గంటలకు చంద్రాజుపాలెం గ్రామంలో జరిగే పలు సమావేశాలలో పాల్గొంటారన్నారు.

జెడ్పీ పాఠశాలను సందర్శించి ఎన్ఆర్ఐలు



75త్యాళ్ళూరులో విద్యార్థుల పఠనా సామర్థ్యం పరిశీలిస్తున్న దృశ్యం

పెదకూరపాడు: గతంలో కంటే నేడు ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారిపోగా, విద్యాబోధన సైతం పూర్తిగా మారిందని ఎన్ఆర్ఐలు గుత్తికొండ గురవారెడ్డి, కమల దంపతులు తెలిపారు. మండలంలోని 75 త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాలను మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నాడు-నేడు ద్వారా వచ్చిన మార్పులు, ఐఎఫ్ ప్యానెల్స్ బోర్డులు, బైజూస్ కంటెంట్ ట్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా జరుగుతున్న విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం జూనియర్ కళాశాల, కిచెన్ గార్డెన్, జగనన్న గోరుముద్ద తదితర అంశాలను పరిశీలించారు. భవిష్యత్‌లో తమ వంతు సహాయం పాఠశాలకు అందిస్తామన్నారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసరెడ్డి తదిరులు పాల్గొన్నారు.